# కవితా కౌముది

## నిన్నటి తరం

కుప్పచ్చి ఫణీంద్రకుమార్

**తరమెళ్ళిపోతోంది...**
గురుతర బాధ్యతలు మాపై వదిలి...
తాతల తరం తరలెళ్ళిపోతోంది...

ఉప్పెక్కించుకున్న వీపు విశ్రాంతి కోరింది...
లోకాన్ని చూపించిన వేలు ఇక కనిపించనంది...
కలల అలల పై ఆడించు ఒడి కాలక్రీడకు ఓడిపోయింది...
కథల తోటి మా వ్యథలు తీర్చిన మాట మూగబోయింది..!!
తరమెళ్ళిపోతోంది...
తాతల తరం తరలెళ్ళిపోతోంది...
రేపటిని మాకిచ్చి నేటికి నిన్నలా మిగిలిపోతోంది...!!
స్నేహ శీలతే సంపదగా..
మానవీయతే మన్ననగా...
నమ్మిన విలువలే వెలలేని సిరిగా...
నమ్ముకున్న వారి ఆదరణే తన విధిగా...
నడయాడిన ఓతరం
తన జాడలు మాకై వదిలి...
ఇక శెలవంటూ వెళ్ళిపోతోంది...కాల గతిలో మళ్ళిపోతోంది..!!
కడగండ్లను ఎదిరించు మనోస్థైర్యమే శ్వాసగా ...
భేషజమెరుగని బోసినవ్వులే తన బాషగా...
ప్రతిదినమున అగుపించే సూర్యోదయమే తన ఆశగా...
పరోపకరమే పెన్నిధిగా...పరమానందమే పరమావధిగా...!!
బ్రతికిన  తరమెళ్ళిపోతోంది...
మా తప్పులను సరిచేయు అనుభవాల తరువు తరిగిపోతోంది...!!!

## ఓటమి
### మోహన్ చైతన్య

అపుడపుడే వచ్చిన
లేలేత రెక్కలతో
ఊహాకాశంలో విహరించే
భావ విహంగాలను
అక్షరాల పంజరాల్లో
బంధిద్దామని
మహాగ్రంథం విరచిద్దామని
తెల తెల్లని బ్రతుకు పుస్తకంపై
వెర్రి మొర్రి ఉద్వేగంతో
నే ప్రయత్నిస్తే
చితికిన ఆశల
సిరా చుక్కలు
అటు ఇటు ప్రవహిస్తే
మిగిలిందంతా నల్లనే
బ్రతుకంతా తీరని అవేదనే!!

## అ 'మర' జీవి - కవి
### ప్రజ్ఞా మధుబాబు

బతికుండగా చస్తాడు
మరణం అవతలినించి ఈ జీవితాన్ని చూస్తాడు
మనసు రంగులు మనిషికై అద్దుతాడు
కనులు మూసుకున్నా చూడగలడు
తెరిస్తే నిద్ర పోతాడు
రవి చూడనివీ చూడగలడు
విమానాలు లేకున్నా విహరించగలడు
ముందున్నవి చూడలేడు
వేటికోసమో వెదుకుతాడు
అమృతం తాగకున్నా అమరుడు
నింగిలోని తారలని నేలపైకి విసురుతాడు
మరి ప్రజలకొరకు బతుకుతాడు

# నా జ్ఞాపకాలు

గంటి భానుమతి

కొన్నివేల అమావాస్యల్లాంటి చీకట్లోకి
నిశ్శబ్ద నీరవనిశీధిలోకి చూస్తున్నా
జ్ఞాపకాల పొరలు ఒక్కొక్కటి విడిపోతుంటే
ఆమడ దూరానున్న నిద్రకేసి ఆశగా
విప్పార్చుకున్న కళ్ళతో, విధిలేక
కళ్ళని చెమర్చిన జ్ఞాపకాలు కొన్ని
గుండెమూలల్ని తడిమినవి కొన్ని
ఉత్సాహ డోలలూగించినవి కొన్నయితే
మనసుని చంపేసినవి కొన్ని - అన్నీ నావే
రెప్పల చివర ఆగిపోయిన కలలు
కళ్ళనుంచి జారిపోయిన కలలు
కన్నీటిలో తడిసిపోయిన కలలు
కల్లలయిన కలలు..అన్నీ నా జ్ఞాపకాలే
ఏకాంతంలో అలజడిని కలిగిస్తూ
నిద్రకి బద్ధ శత్రువులైపోయాయి..
బాల్యంలోని నిర్మల అమాయక జ్ఞాపకాలు
వయసులో ఇంద్రచాపాల్లాంటి జ్ఞాపకాలు
అన్నీ చైతన్యం నింపుకున్నవి
నాకు చెందినవి ఈ జ్ఞాపకాలు!
ఒంటరి జీవితానికి తోడౌతాయనుకుంటే
ప్రతినిమిషాన్ని భంగపరుస్తున్న జ్ఞాపకాలు
అందుకే
మళ్ళీ మళ్ళీ నా కళ్ళముందుకి రాకుండా
నా ప్రశాంతతని భగ్నం చెయ్యకుండా
నా మనసుని పక్కదోవ పట్టించకుండా
రోజురోజుకి శత్రువులై పోతున్న ఆజ్ఞాపకాలని
ముక్కలు ముక్కలుగా చేసి
నాకు తెలీని దారిలో
నేను వెళ్ళని దారిలో విసిరేశాను!
ఒక్కసారిగా తుఫాను, సుడిగాలి
...గాలి వాటం..విసురు మారింది..
ముక్కలు చేసిన జ్ఞాపకాలు పైకి లేచాయి
ఎగురుతూ , ఎగిసిపడుతూ, సుళ్ళు తిరుగుతూ
నా కళ్ళముందు ఎగురుతున్నాయి
కళ్ళకి దగ్గరగా ఎగురుతున్నాయి..
దగ్గర గా , పెద్దగా, ఇంకా దగ్గరగా, ఇంకొంచెం పెద్దగా ..
ఉలిక్కి పడ్డాను..అందులోని భావాల్ని చూసి
అవన్నీ నేను వెనక్కి తోసేసిన జ్ఞాపకాలు
నేను చింపేసిన నా జ్ఞాపకాలు
నాకు చెందిన నా జ్ఞాపకాలు
నన్ను వదల్లేని నా జ్ఞాపకాలు
మనసుని వదల్లేని జ్ఞాపకాలు
చెమర్చినవి, కుదిపేసినవి
గుండెల్ని పిండేసినవి, కదిలించినవి
నన్ను వదలని ఆస్థులు. స్థిరాస్థులు
చివరకూ తోడుగా, నన్నంటే జ్ఞాపకాలు
నా వెంటనుండే జ్ఞాపకాలు!!

## ఈ ఉదయం
### ఆత్రేయ కొండూరు

బరువుగా బిగిసిన
తలుపుల వెనక, చీకట్లో..
రంగుల ప్రపంచం
ఓ లోయ సరిహద్దుల్లో అంతమయింది

రెండు సూర్యుళ్ళ ఉదయంతో
సగం కాలిన రాత్రి
ముళ్ళ కంప మీద
అలానే కరిగిపోయింది.

చెట్ల పచ్చని రంధ్రాల్లోనుంచి
జారిపోతున్న చీకట్లకు
తనువు చాలించిన తుంపర్లు
తెరలవుతున్నా..

చల్లగా వీచిన తెల్లపదాల తావి
పూల తోటలోకి ..దారి చూపింది.

## ఇదేమిటి
### భువనచంద్ర

కనులను మూసేసుకునీ
కలల్లోన దాగున్నా!
ఎదలోయల మలుపుల్లో
చితులను పేరుస్తున్నా!
చెదపట్టిన ఓ 'గురుతు' ని
కొత్తగాలి చెరిపేస్తే..
పాతరాత తుడిచి పెట్టి
'భాష' ని కనిపెడుతున్నా!
గుండెలోన సూదిగుచ్చి
ప్రవహించే రక్తంలో
అక్షరాల ముత్యాలని
కాలంతో కొలిచేశా
ఎన్ని ఎన్ని ముత్యాలు!
ఎన్ని రుధిర సంద్రాలూ..!
ఆవిరైన ఊహల్లో
ఎన్ని ఎన్ని 'వర్షా'లూ..!
రాతి మీది యాతా..
ఇది
లేతగుండె కోతా?

# మీకు తెలిస్తే చెప్పరూ?

పి.ఎస్.నారాయణ

ఈ జగత్తు చీకటి తెరల్లో కప్పబడి
భూమి తన ఉనికిని గుర్తించని అస్థిత్వంలో
సమయానికి సమయం తెలియని సమయంలో
తొలికిరణాన్ని జ్వలింప జేసిందెవరు?

విశ్వాంతరాళాల్లో పుడమిని ఏ
ఆధారం లేకుండా వ్రేలాడదీసి
తన చుట్టూ తాను పరిభ్రమింపజేస్తూ
సూర్యుని చుట్టూ చలింపచేస్తున్నదెవరు?

వసుధకు ప్రకృతిని చీరగా చుట్టి
గుట్టలు - పుట్టలు, చెట్టులు-చేమలు
పొలాలు - పీఠభూములు, నదీ నదాలు
సముద్రాలతో అలంకరించినదెవరు?

భూమాత నిశ్శబ్ద గమనాన్ని చీలుస్తూ
మానవమనుగడకి నాంది పలుకుతూ
భావితరాలకు సృష్టికి సంకేతాన్ని సూచిస్తూ
'కేరు'మన్న మొదటి జీవికి జన్మనిచ్చిందెవరు??

ఆనందం - విషాదం సుఖం - దుఃఖం
ఆశ-నిరాశ, ఆవేశకావేశాలు
ఇలా ఎన్నో వివవరణ లేని భావనలతో
మనిషిని సతమతం చేస్తున్నదెవరు??

అన్నీ తనవనుకుని, ఏదీ తనదికాదని
తెలుసుకోకుండానే శాశ్వతంగా నిష్క్రమించే
ఈ జీవి రాక ఎక్కడ్నుంచీ..? పోక ఎక్కడికి?

మీకు తెలిస్తే చెప్పరూ...!!??

# అయ్యో! నా కంఫర్ట్ జోనా! డా.గరిమెళ్ళ నారాయణ

**అయ్యో నా కంఫర్ట్ జోనా!**
ఫొటోలలోని దేవుళ్ళ వెనుక
తిరిగే దేదీప్యమానమైన చక్రాల్లా
నన్ను అంటి పెట్టుకుని
నాకు ఎనలేని కీర్తిని పాదించిపెడతావని
నిన్ను నమ్ముకుంటేణ
ఎప్పుడూ నేల విడిచి సాములే చేస్తానంటావు.

లైఫ్ ఇన్స్యూరెన్స్‌లాగో
హెల్త్ ఇన్స్యూరెన్స్‌లాగో
ప్రావిడెంట్ ఫండ్ లాగో
బ్యాంక్ బ్యాలన్స్ మీద నెల నెలా వచ్చే
అసలు కన్నా ముద్దు ఐన వడ్డీ లానో
ధోకా నిచ్చే సుఖమయ జీవితపు పానుపుతో
నన్ను ఆదుకుంటావనుకుంటే

ఎడారులమ్మటా అడవులమ్మటా
కొండల కోనల వాగుల వెమ్మటా
అలుపెరగ కుండా తిరిగిస్తూ
సమాజాన్ని ఔపోసన పట్టమంటావు!
సమ సమాజాన్ని సృష్టించే వాళ్ళ
కలల్లో కలలు కలిపి పునర్జన్మించ మంటావు!

వసుదేవుడు చిన్ని కృష్ణున్ని కాపాడు కున్నట్టు
నువ్వు కూడా అనేకానేక గాడిదల కాళ్ళు
పట్టుకునైనా
నన్ను కాపాడు కుంటావనుకుంటే...
అన్యాయమని పించిన ప్రతి చోటా
నన్ను బలిచేసిమరి ప్రశ్నలు ప్రశ్నలై
విచ్చుకుని తెగని వాళ్ళకు గుచ్చుకుని మరీ
అనేకానేక శత్రువులని సంపాదించి పెడతానంటావు!

కనీసమైనా లౌక్యం నేర్చుకుని
ఐన వాళ్ళకు ఆకుల్లోను కాని వాళ్ళకు కంచాల్లోనూ
పెట్టడం నేర్చుకుని
నన్ను అందలమెక్కిస్తావనుకుంటే,

పదివేల రూపాయల అప్పు తీర్చలేకే
పురుగుల మందు తాగి చనిపోయిన రైతు మాదిరి,
సూక్ష్మ రుణాల ఊబిలో కూరుకుపోయిన
అమాయకపు పల్లె పడచులు విడిచే ప్రాణాల మాదిరి,
ప్రేమోన్మాది చేసిన యాసిడ్ దాడిలో కళ పోయిన
కలలు కాచిన అమ్మాయి మాదిరి
గాయ పడిన సమాజాల మధ్య సంచరిస్తూ
నిత్యం ఘర్షణలో మునిగి తేలడమె జీవితమని
నినదిస్తూ పోతుంటావు!
చెయ్యని తప్పులు సైతం నెత్తికెత్తుకుని
పకపకల వికవికల జనానికి
ఎప్పటికప్పుడు పాఠాలు చెప్పమంటావు!
అయ్యో నా కంఫర్ట్ జోనా
నాకు తెలుసు నన్ను నువ్వు నిశ్చలంగా ఉండనివ్వవు
ఎప్పటికప్పుడు నా నుండి దూరమవుతూ నిన్ను
అందుకోవడమే నాకు నిత్య జీవిత పరిక్షంటావు!
కాని, ఇప్పుడు నేను సాగరాన్ని మధించే వాళ్ళకు
మందర పర్వతాన్ని కావడానికి సిద్ధపడిన వాడిని.
నాకు నీతో పనేమిటి?
ఒక సారి హాలాహల మొచ్చినా
ఎప్పటికైనా అమృతాన్ని చిలికి
అభాగ్యులందరికీ సమానంగా పంచి పెడతాంలే

## హస్త లాఘవం
## నూతక్కి రాఘవేంద్రరావు

అధికారి

హస్తాక్షరం చేసిన

హస్తానికి

తెలియదు

పాపం

అడిగిన మొత్తం

దండుకొని

బహిరంగంగా నే ...

రెండో చేయి

దాచి పెట్టిన

ముడుపు ల సంగతి.

## మనసు
## భద్రిరాజు శ్రీనివాస్

ప్రేమ భావంతో పులకరిస్తుంది.
విప్లవ స్ఫూర్తితో ఉరకలేస్తుంది.
భవిత నాదేనంటూనింగిని తాకుతుంది.
నైరాస్యంతో నీరుగారిపోతుంది.
చేతిలోని ఇసుకలా జారిపోతున్న రోజులని ,
మంచుముక్కలా కరగు ఆయువునూ చూచి భీతిల్లుతుంది.
అంతా మిధ్య అంటూ, గుడుల తిరుగుతుంది
గురువుల నడుగుతుంది ;
ఆశ్రమాలనాశ్రయిస్తుంది, ఆరామాలచేరమంటుంది
అంతలోనే సౌఖ్యాభిలాషియై రంజిల్లుతుంది.
వయసుమీరిన తనువులూ, వయసెరుగని తానిమడలేక ,
నిన్నతానున్న తామునున్న ఆ యువత ఎడ అసూయతో
అలసిపోతుంది---మనస్సు
మాయ మోహితమై, తుఫాను తాకిన మహాసముద్రపుటలలా
ఊగిపోయేదీ మనస్సు
మారనిది మహామయస్వరూపమైనది కాలం;
నిర్వేదంగా నిర్వికారంగా నిలచివుంటుంది

# ప్రేమవృక్షం

డా.రమణ యశస్వి

గోరుముద్దలలో
అఆఇఈ లు
నంజి పెట్టిన
గొప్ప ప్రొఫెసర్ మా అమ్మ
చలువే నేను
చదివిన పెద్ద చదువులు
జలుబుకీ
కడుపు నొప్పికి
వెరవక
అన్నీ తానై నన్ను రక్షించి
పెంచి పెద్దచేసిన
గొప్ప డాక్టరు మా అమ్మ

నేను పొడుగవ్వాలనీ
దృఢంగా బాగుండాలనీ
మంచి ఆహారమిచ్చి
డ్రస్సులు వేసి
మౌనంగా నా ఎదుగుదలను
గమనిస్తూ వుండే మా అమ్మ
గొప్ప బ్యూటీషియన్

నేను బడినుండో, కాలేజీ నుండో
రాగానే నా మనసు స్కాన్ తీసి
ఆ రోజు క్లాసులో ఏమైందో
కనుక్కుని నాకు సలహాలిచ్చే
మా అమ్మ గొప్ప
మనోవికాస నిపుణురాలు

సాయంత్రం నేనొచ్చే దాకా
'అ'లు పెరుగని 'మ్మ'నస్సుతో
నా కోసం అరుగుపై
ఎదురుచూసే మా అమ్మ
గొప్ప ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్

నాన్న చేసే తప్పులు దిద్ది
సంసారమనే బండిని
ప్రక్కసీట్లో కూర్చొని
సాఫీగా నడిపిన
నిశ్చల మనస్విని
గొప్ప రధసారధి మా అమ్మ

మగవాడికూ్కడా
శీలం ముఖ్యం అంటూ
అడుగడుగునా
గీతదాటకుండా
గీతబోధించిన
నడిచే భగవద్గీత మా అమ్మ!

జీవితమనే సినిమా
ఎన్ని మలుపులు తిరిగినా
శుభం కార్డు
పడేలా చేయగల
సమర్థ కథానాయకి మా అమ్మ!
ప్రేమ విత్తనాలు జల్లి
ప్రేమను పంచి
ప్రేమను పెంచిన
మహాప్రేమ వృక్షం మా అమ్మ!!

# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

తెల్ల వారక ముందె యూరెల్ల లేచి
నాల్గు వీథుల భోగిమంటలు వెలార్చ
నీవు లేనట్టి యొంటరి హృదయమందు
తేజరిల్లెను యాశల దివ్వెలెన్నొ

వాడ యెల్ల నిండిన రంగవల్లికలను
మురియుచును చూచి యింటికి తిరిగి రాగ
ముగ్గు లేనట్టి నా యింటి ముందరెవరొ
రచన చేసిరి సంక్రాంతి రథమునొకటి

ఇది మహానందభరిత పర్వదినమ్ము
భావి దినములకెల్ల శుభప్రదమ్ము
ప్రతి గడప కడు రమ్యశోభాయుతమ్ము
కలసి తిలకింతుమూరెల్ల కదలి రమ్ము

ఈవు లేని శుభ దినమ్ములెన్ని యైన
నడచి పోవును రసవిహీనమ్ములగుచు
నిండునెల వోలె నాయింట నిండి నీవు
పండుగలకెల్ల కాంతిని బరపవలయు

పర్వదినములవేల కావలయు మనకు
మనసు స్ఫటికమై స్వచ్ఛమై మనెడు కొరకు
బంధములు మనమధ్యనేర్పడెడు కొరకు
బ్రతుకు తీయదనమ్మును బడయు కొరకు

Click here to share your comments on these poems